
కథ

# దూరపు కొండలు

బి.వి.రమణారావు



కృష్ణప్రసాద్ వుండేది వూరు కాదు. అలా అని అడవే కాదు. అడవిలో కట్టిన రైల్వే స్టేషన్ ఆను కుని కట్టిన రైల్వే క్వార్టర్. అక్కడ మహా వుంటే పదిపదిహేను రైల్వే క్వార్టర్స్ వుంటాయి. రైల్వేలో పనిచేసేవారు తప్ప మరెవరూ అక్కడ వుండరు. ఆ ఊరే పేరే "త్యేడా" రైల్వే స్టేషన్ అయినా అదే... ఊరైనా అదే... ఇది కొత్త వలస. కిరిండూల్‌కు వెళ్లే రైలు మార్గంలో వుంది.

డ్యూటీ నుంచి వచ్చిన కృష్ణప్రసాద్ వేడి నీళ్లతో తలస్నానం చేసి బాత్‌రూమ్ నుండి తల తుడుచుకుంటూ తన గదిలోకి వచ్చి మంచంపై వాలాడు. ఉదయం నుండి ఎండలో డ్యూటీ చేసి వచ్చిన అతనికి బడలిక కొంత తీరినట్లుగా వుంది. మంచం పై నుంచి లేచి ఏవైనా ఉత్తరాలు వచ్చాయోమోనని తన టేబుల్‌పై చూసాడు. గుండ్రని ముత్యాల్లాంటి అక్షరాలతో తన అడ్రస్‌తో వున్న కవరు కని పించింది. ఆ దస్తూరి చూడగానే తన ఆప్తమిత్రుడు హరగోపాల్ నుండి వచ్చిందని తెలియగానే వున్న కాస్త బడలిక పోయి ఉత్సాహంగా కవరు తీసుకొని ఉత్తరాన్ని పైకి తీసి చదవడం మొదలుపెట్టాడు.

*"ఒరే! కృష్ణా!..."*

ఆ సంబోధన ఎంతో మధురంగా, ఆత్మీయంగా వుంది. హరగోపాల్ ఉత్తరం ఎంత బాగా రాయగలడో తను అంత పేలవంగా రాస్తాడు. గోపాల్ ఉత్తరం చదువు తుంటే ఎదురుగా మాట్లాడుతున్నట్లే వుంటుంది. ఉత్తరం చదవడం మొదలు పెట్టాడు.

*"నీవు రాసిన ఉత్తరం అందింది. వెంటనే జాబు రాస్తున్నాను. నీ ఉత్తరం చదువు తుంటే నాకు మన చిన్ననాటి ఎన్నో సంఘటనలు గుర్తుకు వస్తాయి. 'గోళీకాయలు',*

'కోతి కొమ్మొచ్చు', 'కర్రబిళ్ల' ఆటలు... ఓహ్! ఆ రోజులే వేరు. ఒరే! కృష్ణా ఒకోసారి ఏమనిపిస్తుందో తెలుసా?! భగవంతుడు మన వయస్సును పెరగనీయకుండా అక్కడితో ఆపేస్తే ఎంత బాగుండునని. కానీ నా పిచ్చి ఆలోచనకు నాకే నవ్వు వస్తుంది. ఇప్పటి జీవితాలు ఏమిటో అంతా 'మెకానికల్'గా వుంటున్నాయి. నా మటుకు నేను ఉదయం లేవడం ఆరోజుకి అటెండ్ అవవలసిన కేసులు చూసుకోవడం, కోర్టుకు వెళ్లడం, ఆర్గ్యుమెంట్స్, సాయంత్రం ఇంటికి రావడం అంతా రొటీన్ లైఫ్ బోర్ కొడుతుందిరా.

ఒరే! నన్నుగాని అడిగితే నీ ఉద్యోగమే బెటర్. రైల్వేలో పర్మినెంట్ వే ఇన్‌స్పెక్టర్‌వి (పి.డబ్ల్యూ.ఐ). నిన్ను ఊహించుకుంటే నాకు చాలా ఆనందంగా వుంది. ఎందుకో చెప్పనా? పూర్వం రాజులు రథాల్లో ఎలా వెళ్లేవారో తెలియదు. సినిమాల్లో చూడడమే కాని, నీవు మాత్రం 'ట్రాలీ'లో వెళుతుంటే రాజులు రథంలా పైన గొడుగు – ఆ రథాన్ని గుర్రాలు లాగితే నీ రథాన్ని (ట్రాలీని) మనషులు తోస్తారు. ఆ రథానికి నాలుగు పెద్ద చక్రాలు వుంటే నీ రథానికి నాలుగు చిన్న చక్రాలు వుంటాయి. అంతే తేడా. కానీ నీవు ట్రాలీలో వెళుతుంటే నిజంగా రాజువే! కాదంటావా? అదుగో దూరపు కొండలు నునుపు అనుకుంటున్నావు కదూ? కాదురా! నీవు నిజంగా రాజువే. కృష్ణా! నీతో పాటు నీ ట్రాలీ మీద నన్ను తీసుకుని వెళ్లాలి సుమా– ఏదో 'కథలు' చెప్పి నన్ను ఒంటరిగా ఇంటిదగ్గర వదిలేసి నీవు డ్యూటీకి వెళ్లిపోతే ఈసారి వొప్పుకోను. నేను ట్రాలీలో కూర్చోవడమే కాదురా! నీవు ట్రాలీలో కూర్చుంటే నేను ట్రాలీ తోస్తాను, ట్రాలీ రాడ్ పట్టుకుని తోస్తూ ఆ పట్టాలుపై నుండి పరుగెడుతుంటే గమ్మత్తుగా వుంటుంది. అవునా? అందుకే వస్తాను. ఇక వుంటాను. ఇప్పటికే చాలా పెద్ద లెటర్ రాసాను. చెల్లాయికి నా దీవెనలు.

నీ మిత్రుడు
హరగోపాల్."

ఉత్తరం చదవడం పూర్తి చేసి కవర్లో భద్రంగా పెట్టి టేబుల్‌పై వుంచాడు. శ్రీమతి దగ్గర నుంచి భోజనానికి రమ్మని కేక వినిపిస్తే వెళ్లి నాలుగు ముద్దలు తిని లేచాడు. బెడ్‌రూమ్‌లోకి వచ్చి పడుకున్నాడే కాని నిద్రరావడం లేదు. తన మిత్రుడు రాసిన ఉత్తరమే కళ్లల్లో కనిపిస్తుంది. తన ఉద్యోగం గురించి తన మిత్రుడే కాదు అందరూ అలాగే అనుకుంటారు. నిజంగా హరగోపాల్ రాసినట్లు దూరపు కొండలు నునుపే. మా ఉద్యోగాలు కూడా దూరపు కొండలు లాంటివే! ఎండకు ఎండాలి. వానకు తడవాలి. ప్రకృతికి అనుకూలంగా మా శరీరాలు అలవాటు పడాలి. ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు కృష్ణప్రసాద్.

***

రాత్రి ఒంటిగంట, రెండు గంటల మధ్య కృష్ణప్రసాద్ ఇంటి కాలింగ్ బెల్ మోగింది. మంచి నిద్రలో వున్న కృష్ణప్రసాద్ ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచాడు. పక్కనే పక్క మీద నిద్రలో వుంది శ్రీమతి. మెల్లిగా లేచి తలుపు దగ్గరకు వచ్చి

"ఎవరూ?" అని అడిగాడు.

"నేన్సార్! టోకెన్ పోర్టర్ని" వెంటనే తలుపు తీశాడు. ఎదురుగ్గా టోకెన్ పోర్టర్ రామారావు.

"ఏమిటి విషయం రామారావు?" అడిగాడు కృష్ణప్రసాద్.

"చిమిడిపల్లికి – బొర్రా స్టేషన్‌కి మధ్య కొండపై నుంచి జారి పెద్దరాయి పడిపోయిందట సార్. మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నారు పెద్ద స్టేషన్ మాష్టరు బాబు" చెప్పాడు టోకెన్ పోర్టర్ రామారావు.

కృష్ణప్రసాద్ గుండెల్లో రాయి పడినట్లయింది.


"నీవు వెళ్లు రామారావు! నేను వెంటనే వస్తాను" చెప్పాడు కృష్ణప్రసాద్.

రామారావు చేతిలో లాంతరు పట్టుకొని క్వార్టరు దాటి వెళ్లిపోయాడు.

కృష్ణప్రసాద్ గబగబ బట్టలు మార్చుకొని శ్రీమతిని లేపి 'స్టేషన్ మాష్టరు దగ్గర నుంచి రమ్మని కబురొచ్చింది. నేను వెంటనే వెళ్లాలి. నీవు తలుపులు వేసుకో జాగ్రత్త' అని చెప్పి టార్చ్‌లైటు తీసుకొని రైల్వే స్టేషన్ వైపు బయలుదేరాడు కృష్ణప్రసాద్.

స్టేషన్ వెళ్లగానే అప్పటికే తన కోసం ఎదురు చూస్తున్న స్టేషన్ మాష్టరు జరిగిందంతా విపులంగా చెప్పి, ఆ రూట్ గుండా ట్రాలీ వెళ్లడానికి తీసుకున్న టోకెన్ (అనుమతి) కృష్ణప్రసాద్‌కి ఇచ్చాడు. ఈ లోపుగా ట్రాలీ మెన్ కూడా కబురు అందుకొని వచ్చారు. రాగానే ట్రాలీని పట్టాలపై పెట్టి కృష్ణప్రసాద్ దానిపై కూర్చోగానే ట్రాలీ బయలుదేరింది.

ట్రాలీ కొండల్లో నుండి ఝుంకార శబ్దంతో పరుగెడుతోంది. కృష్ణప్రసాద్‌కు ఆ రూట్ అంతా కొట్టిన





ఒక్కసారి కాకతీయను సంప్రదించండి.
ఇక వెళ్లి పెళ్లి ఏర్పాట్లు చేయండి.

**కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్**

103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999



www.kaakateeya.com

శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

పిండిలాంటిది. అతడు 'త్యేడా' రైల్వే స్టేషన్‌కి ట్రాన్స్‌ఫర్ అయి దాదాపు పది సంవత్సరాలు అవుతోంది. ఆ రైలు రోడ్‌లో ఏ చెట్టును, పుట్టను చూసినా అతడు ఏ స్టేషన్‌కి ఎంత దూరంలో వున్నాడో చెప్పగలడు. వెన్నెల రాత్రి కావడం మూలంగా దారి బాగానే కనిపిస్తుంది. అయినా ట్రాలీ పట్టాలపై నుండి పరుగెడుతుంటే ఆ ట్రాలీ శబ్దాన్ని బట్టి రైలు పట్టాకు ఎక్కడ చిన్న 'సీల' లూజ్ అయినా అతనికి తెలిసిపోతుంది. రైలుకు, అందులో ప్రయాణించే ప్రయాణీకులకు ఎటువంటి ప్రమాదం రాకుండా రైలు రోడ్డును కాపాడే బాధ్యత వాళ్లది. కాని వాళ్ల ట్రాలీకి, వాళ్లకు మాత్రం గ్యారంటీ లేదు. దేశసౌభాగ్యం కోసం రైలును, అందులో ప్రయాణించే ప్రయాణీకుల ప్రాణాలను, తమ ప్రాణాలను ఫణంగా పెట్టయినా సరే కాపాడాలి. ఎంతమంది ప్రయాణీకులకు తాము 'గేంగ్‌మెన్' చెమటతో తడిసిన పట్టాలపై నుంచి హాయిగా ప్రయాణం చేస్తున్నామని, వారి చెమట ధారలే ఈ రైలు పట్టాలని తెలుసు. ట్రాలీ బ్రేక్ శబ్దానికి ఆలోచిస్తున్న కృష్ణప్రసాద్ ఏమయిందని ట్రాలీ పక్కకు చూసాడు. వెన్నెల వెలుగులో పెద్ద చింత చెట్టు, అంటే వాళ్లు చేరవలసిన గమ్యం ఇంకా అరకిలోమీటరు దూరంలో వుంది.

ఇక ఆలోచించి లాభంలేదని వెంటనే హ్యాండ్ బ్రేక్ అప్లయి చేస్తూ ట్రాలీలో వున్న నలుగురు ట్రాలీమెన్‌ని పక్కకు దూకేయమని కేకేశాడు. ఉన్న నలుగురిలో ముగ్గురు కొత్తవారు. ఎటు గెంతాలో, ఎలా గెంతాలో అనుభవం లేనివారు. తొందర, గాభరా, భయం. వారు ఎలా గెంతాలో, ఎటు గెంతా వారికి చెప్తూనే హ్యాండ్ బ్రేక్ అప్లయ్ చేస్తున్నాడు. అది బాగా డౌన్ గ్రేడియంట్. ఒకే పర్యాయం బ్రేక్ వేసినా ట్రాలీ తుళ్లి వ్యాలిలోకి పడిపోతుంది.

"ఏమయిందిరా" వెంకన్నని అడిగాడు.

"బౌల్డర్ పడిన స్థలానికి దగ్గరయిపోనామండయ్యా!"

"సరే! ఇక్కడ నుండి ట్రాలీ మెల్లిగా పోనీయండి" చెప్పాడు కృష్ణప్రసాద్.

బౌల్డర్ (పెద్దరాయి) పడిన స్థలానికి చేరుకున్నారు. చుట్టూ ఒకసారి పరిశీలించాడు కృష్ణప్రసాద్. మీకు మేము తోడున్నాం నేస్తం అన్నట్లుగా మిణుగురు పురుగులు చుట్టూ మిణుకు మిణుకుమంటూ మెరుస్తున్నాయి. దూరంగా నక్కల అరుపులు, పులుల గాండ్రింపులు వినిపిస్తున్నాయి. కొత్తగా ఆ ప్రదేశానికి ఎవరైనా వస్తే మాత్రం భయం వేస్తుంది. కృష్ణప్రసాద్‌కి ఇవన్నీ అలవాటు అయిపోయాయి. పట్టాల పైన పడిన రాయిని చూసాడు. మరీ అంత పెద్దది కాదు. అలా అని చిన్నది కాదు. రాయిని బద్దలు కొట్టి ట్రాక్ క్లియర్ చేయడానికి ఎంతలేదన్నా రెండు మూడు గంటలు పడుతుంది. టైమ్ చూసుకున్నాడు ప్రసాద్. రాత్రి రెండున్నర అవుతోంది. వెంటనే పని మొదలుపెట్టారు.

***

తెల్లవారి ఐదు, ఐదున్నర అవుతోంది. పని పూర్తయింది. నిద్రమత్తులో నుండి ప్రకృతి వళ్లు విరుచుకుంటోంది. రకరకాల పక్షుల చిత్రవిచిత్రమైన కూతలు మనస్సుకు ఎంతో ఆహ్లాదంగా వినసొంపుగా వుంది. ట్రాక్ క్లియర్ అయినట్లు, కంట్రోలు రూమ్‌కి ఫోన్ చేయడానికి టెలిఫోన్ కిట్ తీసుకొని కొంత దూరంలో వున్న టెలిఫోన్ ఎమర్జెన్సీ సాకెట్‌కి కనెక్ట్‌చేసి కంట్రోల్‌రూమ్ కోసం ప్రయత్నిస్తున్నాడు కృష్ణప్రసాద్.

"హల్లో!... హల్లో... విశాఖ కంట్రోల్ రూమ్... నేను పి.డబ్ల్యు.ఐ... కృష్ణప్రసాద్‌ని మాట్లాడుతున్నాను సైట్ నుంచి"

"హల్లో... హల్లో... కంట్రోల్ రూమ్ నుండి రామ్‌గోపాల్ మాట్లాడుతున్నాను... నమస్కారం... చెప్పండి... పని పూర్తయిందా? ఇంకా ఏమయినా ట్రబుల్ వుందా?" రామ్‌గోపాల్ అడిగాడు.

"లేదండి! వెళ్లే డౌన్ ట్రైన్‌కి ఏ ట్రబుల్ లేదు. ట్రాక్ క్లియర్ చేసాం.. హల్లో... మీరు బొర్రా స్టేషన్‌లో వున్న డౌన్ ట్రయిన్ విడిచిపెడితే నేను దగ్గర వుండి ట్రయిన్ పాస్ చేసి.. దాని వెనుక ట్రాలీలో వచ్చేస్తాను... హల్లో... వింటున్నారా?!..."

"ఆ.. ఆ... వింటున్నాను... మీరు స్పాట్‌లో వుండి ట్రయిన్ పాస్ చేయండి...పాపం రాత్రంతా మీకు రెస్టు లేదు...హల్లో మీరు త్యేడా స్టేషన్‌కి చేరిన తరువాత అప్ ట్రయిన్ త్యేడా స్టేషన్‌లో వుంది... దాన్ని విడిచిపెడతాను..హల్లో అలాగేనా?"

"హలో.... అలాగే.... థాంక్యూ... వుంటాను మరి... నమస్తే"

కృష్ణప్రసాద్ ఫోన్ డిస్‌కనెక్ట్ చేసి టెలిఫోన్ కిట్‌లో పెట్టి ట్రాలీలో ఓ పక్కగా వుంచాడు. డౌన్ ట్రయిన్ వచ్చాక దగ్గరుండి ట్రయిన్ పాస్ చేసి ట్రాక్ పక్కగా వుంచిన ట్రాలీలో కూర్చున్న కృష్ణప్రసాద్ కళ్లు మూతలు పడ్డాయి. కళ్లు తెరచి టైము చూసుకుంటే, డౌన్ ట్రయిన్ వెళ్లి సరిగా అరగంట అయింది. అంటే తను ఇక ట్రాలీ తీసుకొని బయలుదేరవచ్చు. వెంటనే ట్రాలీ మెన్‌కి చెప్పి ట్రాలీని ట్రాక్ మీద పొజిషన్‌లో వుంచి బయలుదేరాడు కృష్ణప్రసాద్. తెలతెలవారి వెలుగు చెట్లపై చాలా అందంగా పడుతోంది. చుట్టూ పచ్చని కొండలు, కొండల్ని సగం దాకా కప్పేస్తూ మేఘాలు, కొండపూల పరిమళంతోపాటు చల్లని గాలి తగులుతుంటే ఎంతో ఆహ్లాదకరంగా వుంది. మరి కొంత దూరం వెళ్లగానే చేతికి అందే అంతదూరంలో తెల్లని మేఘాలు తెల్లని గులాబీలు కుప్పలు పోసినట్లు వున్నాయి. ట్రాలీ టన్నల్‌లోకి వచ్చింది. అంతా చీకటి. మనిషి జీవితంలో కష్టసుఖాలులా అనుభవిస్తున్న ఆనందాన్ని కొద్ది నిమిషాలపాటు 'టన్నల్' అనే చీకటి కప్పేసింది. బయటకు రాగానే వెలుగు, ఆ టన్నల్‌ని కలుపుతూ పెద్ద బ్రిడ్జి పక్కనే పెద్ద జలపాతం నీటి తుంపర్లు గాలితో పాటు శరీరాన్ని తాకుతుంటే ఎంతో హాయిగా వుంది. ఆ రైలు మార్గంలో ప్రయాణం అంటే చెప్పలేని ఆనందానుభూతి. కృష్ణప్రసాద్ ఆలోచిస్తూండగానే 'చిమిడిపల్లె' రైల్వే స్టేషన్ దాటిపోయింది. మరో పది నిమిషాలలో 'త్యేడా' రైల్వేస్టేషన్ వచ్చేస్తుంది. పద్నాలుగో నెంబర్ టన్నల్ పదిహేను ఇరవై మీటర్ల దూరంలో వుంది. ఆ టన్నల్ దాటితే 'త్యేడా' స్టేషన్, అదే సమయంలో టన్నల్‌కి అవతల వైపు నుండి రైలు టన్నల్‌లోనికి వస్తున్న సంకేతంగా ఇంజన్ కూత వినిపించింది కృష్ణప్రసాద్‌కి. అంటే వాళ్ల ట్రాలీ వెళుతున్న పట్టాల మీద నుంచే అవతలి నుండి రైలు వస్తుంది. ఇది ఎలా సాధ్యం. తను ట్రయిన్ పొజిషన్ అడిగే బయలుదేరాడు. రామ్‌గోపాల్ డ్యూటీ ఆఫ్ అవుతూ రిలీవర్‌కి చెప్పడం మరిచిపోయాడా? ఇక ఆలోచించి లాభంలేదని వెంటనే హ్యాండ్ బ్రేక్ అప్లయి చేస్తూ ట్రాలీలో వున్న నలుగురు ట్రాలీమెన్‌ని పక్కకు దూకేయమని కేకేశాడు. ఉన్న నలుగురిలో ముగ్గురు కొత్తవారు. ఎటు గెంతాలో, ఎలా గెంతాలో అనుభవం లేనివారు. తొందర, గాభరా, భయం. వారు ఎలా గెంతాలో, ఎటు గెంతా వారికి చెప్తూనే హ్యాండ్ బ్రేక్ అప్లయ్ చేస్తున్నాడు. అది బాగా డౌన్ గ్రేడియంట్. ఒకే పర్యాయం బ్రేక్ వేసినా ట్రాలీ తుళ్లి వ్యాలిలోకి పడిపోతుంది. జాగ్రత్తగా బ్రేక్ వేస్తూ, అతని అనుభవాన్నంతా చేతల్లో చూపిస్తూ ట్రాలీమెన్‌ని దూకేయమని చెబుతూ వారు దూకడానికి సాయం చేస్తున్నాడు. అందరిలో సీనియర్ అయిన వెంకన్న గెంతకుండా –

"బాబూ! తమరు కూడా దూకేయండి! తమరు దూకేసినాక నేను కూడా దూకేస్తాను" అంటున్నాడు.

"లేదు వెంకన్నా! నీవు ముందు దూకే... నేను నీ తరువాత దూకేస్తాను. ముందు మీ ప్రాణాలు కాపాడవలసిన బాధ్యత నాది... ఊ.. దూకే వెంకన్నా ఆలస్యం చేయకు..."

"బాబూ... తమరు..."

ఇంకా ఏదో చెప్పబోతున్న వెంకన్నకి మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా పక్కకు తోసేసాడు కృష్ణప్రసాద్. అదే సమయంలో పెద్ద కూతతో ఎదురుగుండా రైలు ఇంజన్ కనిపించింది. కృష్ణప్రసాద్ ఇంకా ట్రాలీలోనే వున్నాడు. రైలు ట్రాలీని దూసుకుంటూ పోయింది.

***

త్యేడా రైల్వే స్టేషన్‌కి బస్సు మార్గం లేదు. రెండు కిలోమీటర్లు దూరంలో దిగి నడుచుకుంటూ వెళ్లవలసిందే. కారులో వచ్చిన హరగోపాల్ కారును తిరిగి పంపేస్తూ మూడు రోజుల తరువాత డ్రైవర్‌ని రమ్మని చెప్పి కృష్ణప్రసాద్ వుంటున్న రైల్వే క్వార్టర్ వైపు నడుచుకుంటూ బయలుదేరాడు. నడక అలవాటు లేదు. ఆయాసపడుతూ రొప్పుతూ నడుస్తున్నాడు. కృష్ణప్రసాద్ క్వార్టర్ దగ్గరయింది. ఇంటి ముందు జనం. హరగోపాల్ మనసులో అలజడి, ఆందోళన. పరుగులాంటి నడకతో అక్కడికి చేరాడు. అక్కడంతా నిశ్శబ్దం. అప్పటికే అంతా సిద్ధంగా వున్న కట్టె మీద కృష్ణప్రసాద్.

"నో... ఇలా జరగడానికి వీలులేదు. ఇది ఎలా జరిగింది." పెద్దగా అరుస్తూ వెళ్లాడు. ఈ అరుపును పట్టించుకునేవారు ఎవరూ లేరక్కడ. కృష్ణప్రసాద్ ఎంతో ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు వున్నాడు. పక్క నుండి ఎవరో ముసలాయన అంటున్నాడు –

"ఎత్తండి...ఎత్తండి... టైమ్ అయిపోతోంది" అని.

అక్కడున్న వాళ్లల్లో ట్రాలీలో నుండి గెంతేసిన వెంకన్నతో పాటు మిగతా ఇద్దరూ ఒక్కోపక్క మూడు చోట్ల సర్దుకున్నారు. హరగోపాల్ అసంకల్పితంగా నాలుగో పక్క 'కొమ్ము' భుజంపైకి తీసుకున్నాడు. ఇది ఏనాటి బంధమో.

'ఒరే కృష్ణా! నీవు ట్రాలీ మీద కూర్చుంటే నేను ట్రాలీని తోస్తాను అని నా ఉత్తరంలో రాసాను గాని నీవు పాడె మీద వుంటే నేను పాడె మోస్తాను అని రాయలేదురా! ఎందుకురా ఇలా చేశావు' వస్తున్న చెక్కిళ్ళ మధ్య నుండి రోదిస్తున్నాడు హరగోపాల్. ★